సమస్యలు పరిష్కరించాలని వినతి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బంజారా విద్యార్థి సంఘం నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లోని సమస్యలు పరిష్కరించాలని బంజారా విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సేనావత్ శశికుమార్, ధరావత్ సింహాద్రి, మోహిత్ నాయక్, కార్తీక్, సాయికిరణ్, భూక్యా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కూకట్‌పల్లి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం దక్కేలా చూడాలని కూకట్‌పల్లి యువజన కాంగ్రెస్ నాయకుడు గాదె శివ చౌదరి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నుంచి కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ రాష్ట్రానికి అన్యాయమే చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న వారు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, సీఐ ముత్తు యాదవ్ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్‌లో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్, అశోక డెవలపర్స్ అండ్ బిల్డర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జైదీప్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతంలో ఇద్దరు వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన నబీన్ బి.కె. (17) మహంకాళినగర్, శంషీగూడలో నివాసముంటున్నాడు. ఇతను నెలక్రితమే నగరానికి వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తుంటాడు. అతని తల్లిదండ్రులు కూడా నాలుగు నెలల క్రితం నగరానికి వచ్చి ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 9:30 గంటల సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన నబీన్ తల్లిదండ్రులు.. ఇంటి లోపల గడియ పెట్టిఉండటంతో కిటికీలో నుంచి చూడగా అతను ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఫిర్యాదుతో కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివేకానందనగర్‌లో..

కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలో కృష్ణా జిల్లాకు చెందిన కృష్ణ చైతన్య రెడ్డి (34) భార్య, పిల్లలతో నివాసముంటూ వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం భార్య పిల్లలను తీసుకుని స్కూల్‌లో జరుగుతున్న డ్యాన్స్ ప్రోగ్రాం చూడటానికి వెళ్లింది. ఇంటికి వచ్చేసరికి భర్త కృష్ణ చైతన్య రెడ్డి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి రిమాండ్

దుండిగల్: ఫోర్జరీ సంతకాలతో ప్లాటును విక్రయించిన ఘటనలో మరో వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఆర్.రవికుమార్ డాక్టర్. రవికుమార్‌కు మల్లంపేట ప్రాంతానికి చెందిన రాకేశ్, అదే ప్రాంతానికి చెందిన పూర్ణిమను భూ యజమానిగా ఆమె వద్ద నరేశ్ బిల్డర్‌గా పని చేస్తున్నట్లు పరిచయం చేశాడు. వీరు ముగ్గురు కలిసి మల్లంపేటలోని కేవీఆర్ లే అవుట్‌లో రూ.75 లక్షలకు 167 గజాలను రవికుమార్, ఆమె భార్య అరుణ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేశారు. అయితే సదరు స్థలాన్ని ఫోర్జరీ సంతకాలతో విక్రయించినట్లు గుర్తించిన రవికుమార్ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మల్లంపేట ప్రాంతానికి చెందిన లావణ్య, కొత్తి అంజనేయులు నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా గుర్తించారు. గతంలో లావణ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఆంజనేయులు(42)ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు శాపం!

- విద్యుత్, వాటర్ వర్క్స్ అధికారుల సమన్వయ లోపం.. ఆగిన రోడ్డు విస్తరణ
- నిధులు మంజూరైనా వీడని నిర్లక్ష్యం

కేపీహెచ్‌బీకాలనీ: అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల పాలిట శాపంగా మారింది. రోడ్డు విస్తరణ మధ్యలోనే నిలిచింది. నిధులు మంజూరు చేసినా పనులను సకాలంలో పూర్తి చేయడం లేదు. సగం పనులు పూర్తి చేసి, మరో సగం పూర్తి కాకపోవడంతో నెలల తరబడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లో హైటెక్ సిటీకి ప్రతి రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్ర రూపం దాల్చడంతో పాటు గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. స్థానిక సమస్యల పరిష్కారంలో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు రూ.98 లక్షలతో రోడ్డు విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. మలేషియా టౌన్‌షిప్, వన్



తొలగించాల్సిన విద్యుత్ స్తంభాలు, పైపులైన్లు



వన్‌సిటీ వైపు పూర్తైన రోడ్డు విస్తరణ పనులు

సిటీ మొదలుకొని ఫోర్త్ ఫేజ్ ఆర్‌టీఏ కార్యాలయం రోడ్డు వరకు పనులను చేపట్టి గత ఆగస్టు నెలలో పూర్తి చేశారు. అయితే ఏడవ ఫేజ్ నుంచి వేణుగోపాల స్వామి ఆలయం రోడ్డు వరకు మాత్రం పనుల్లో కనీస పురోగతి లేకుండా పోయింది. ఇప్పటికే ఉన్న రోడ్డుకు అదనంగా మరో 20 అడుగుల మేర రోడ్డు విస్తరణ పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య కొంత మేరకు తగ్గుతుంది. ఒకవైపు రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాగా మరోవైపు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

జలమండలి, విద్యుత్ అధికారుల అలసత్వం

రోడ్డు విస్తరణ స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు, జలమండలికి సంబంధించిన వాటర్ పైపు లైన్లను తొలగించటం కోసం జీహెచ్‌ఎంసీ రూ.149 లక్షలను చెల్లించింది. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఆగస్టు నెలలో రోడ్డుకు ఒకవైపు పనులను పూర్తి చేశారు. మరో వైపు పనులు నిలిచిపోవడానికి విద్యుత్ స్తంభాలను, వాటర్ పైపులైన్లను తొలగించకపోవడమే ప్రధాన కారణమని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. రెండు విభాగాలకు చెందిన అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని, విద్యుత్ స్తంభాలు, వాటర్ పైపులైన్లను తొలగిస్తేనే రోడ్డు విస్తరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆ రెండు శాఖలు సమన్వయంతో ముందుకెళ్లి రోడ్డు విస్తరణలు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆలయంలో హోమం.. అన్నదానం



ఓల్డ్ బోయిన్‌పల్లి: మౌని అమావాస్య సందర్భంగా అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గ ఆలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కాల సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు. కార్యక్రమానికి బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూజలు నిర్వహించిన అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ దండుగుల రమేష్, ఉపాధ్యక్షుడు మక్కాల నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బాల్‌రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయనను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో పర్యటించి అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేస్తానని తెలిపారు. త్వరలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని గుర్తు చేశారు. అన్ని రోడ్లను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. తాగునీటి, డ్రైనేజీ



పీఏసీ చైర్మన్ గాంధీకి సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, సత్యనారాయణ, రాజు, వేణు, మనోహర్ రెడ్డి, శివాజీ బాబు, రంగరాజు, వేణుగోపాల్, శ్రీనివాస్ రాజు, ఉమాపతి, వెంకటేశ్వరరావు, పరమేశ్వర్, విశ్వనాథ్, రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



డ్రోన్‌తో పిచికారీ చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణకు ఎల్లమ్మ చెరువులో డ్రోన్ సహాయంతో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల్లో దోమల సమస్య ఎక్కువగా ఉందని గతంలోనే సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ ప్రజల కోసమే పనిచేస్తారన్నారు. త్వరలోనే చెరువులోని గుర్రపు డెక్కను శుభ్రం చేసి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి. నరసింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మోతీనగర్: ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సీఐ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్, గాయత్రినగర్ ప్రధాన రోడ్డులోని హరిహర టెంపుల్ నిర్వాహకులు ప్రదీప్ ఏర్పాటు చేసి లక్ష రూపాయల విలువ చేసే సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో రోడ్డు కనబడే విధంగా జన సంచారం ఉన్న ప్రధాన రోడ్లలో సంక్షేమ సంఘాలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పలు సంఘాల ప్రతి నిధులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, వ్యాపార



సీసీ కెమెరాలు ప్రారంభించిన సీఐ సామల వెంకట్‌రెడ్డి తదితరులు

సంస్థలు, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెసరి సంజీవరెడ్డి, పి. శ్రీనివాసరావు, నాయకులు కృష్ణారావు, కె.శ్రీనివాసరెడ్డి, బ్రహ్మ, నందు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ యూనివర్సిటీగా మారుద్దాం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'యాంటీ డ్రగ్స్' విధానం అమలులో ఉందని హెచ్‌సీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ ఎస్.రుక్మారేఖ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో తెలంగాణ సైబర్ క్రైమ్ టీమ్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సీఐఎస్ ఆడిటోరియంలో 'సైబర్ క్రైమ్స్‌పై ప్రత్యేక అవగాహన' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రుక్మారేఖ మాట్లాడుతూ క్యాంపస్‌ను డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్‌గా మార్చడంలో అందరినీ భాగస్వాములను చేశామన్నారు. అందరూ సంపూర్ణంగా సహకరించడంతో ఇది సాధ్యమైందన్నారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆశిష్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ భద్రతా పద్ధతులను అందరూ అనుసరించడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ, సైబర్‌క్రైమ్స్ టీమ్స్, టీజీసీహెచ్‌ఈ అధికారులు

విద్యార్థులతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు అపోహలకు సమాధానాలను సైబర్ క్రైమ్ విభాగం అధికారులు వివరించారు. కార్యక్రమంలో టీజీసీహెచ్‌ఈ కన్సల్టెంట్ అన్నపూర్ణ గాదెపల్లి, దిల్‌సే వలంటీర్లు సునీల్ సోమనగుర్తి, సాయినాథ్‌చారి, హెచ్‌సీయూ విద్యార్థులు, డీఎస్‌డబ్ల్యూ విభాగ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గాంధీజీ సూత్రాలు బలమైన పునాదిని అందిస్తాయి

ఐసీఎస్‌ఎస్‌ఆర్ సభ్యురాలు ప్రొఫెసర్ షీలారాయ్

రాయదుర్గం: జర్నలిజంలో ప్రస్తుతం సంచలనాలు, తప్పుడు సమాచారం సహా అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని, గాంధీజీ సూత్రాలు గొప్ప మేలు ,బలమైన పునాదిని అందిస్తాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్‌ఎస్‌ఆర్) సభ్యురాలు ప్రొఫెసర్ షీలారాయ్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'మహాత్మా గాంధీ జర్నలిజం ..సమకాలీనయుగంలో దాని ఔచిత్యం' అనే అంశంపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ (ఎంసీజే), ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె సత్యం, అహింస, సామాజిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎంసీజే విభాగం డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ విద్య, అభ్యాసంలో గాంధీ ఆదర్శాలను ఏకీకృతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు, ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

మోతీనగర్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక కోసం శ్రీ వివేకానందనగర్‌లో ఇంటింటి సర్వే జరుగుతోంది. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేస్తున్న వాళ్ల ఇంటికి అధికారులు వెళ్లి చిరునామా వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇళ్ల పరిశీలన అనంతరం వార్డు సభ నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. వివేకానందనగర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవరింటి మస్తాన్ బుధవారం పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేయాలని సిబ్బందికి సూచించారు.

అమావాస్య అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు

మూసాపేట: మూసాపేటలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం అమావాస్య కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బాబూరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమావాస్య పేరిట అన్నదానం నిర్వహించటం ఆర్యవైశ్య సభ్యులకు ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గోపాల్, సప్పిడి శ్రీను, భాస్కర్, అమావాస్య అన్నదాన కమిటీ చైర్మన్ రాములు, మూసాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మంచాల శ్రీనివాస్, కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు పూర్ణ, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉప్పల చంద్రశేఖర్ గుప్తా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్చిలో 150 'ఇందిరా' క్యాంటీన్లు ప్రారంభం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 25వ తేదీ నాటికి 150 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నట్టు 'సెర్ప్' డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ వెల్లడించారు. గచ్చిబౌలిలోని నిథమ్‌లో 7వ బ్యాచ్ మహిళల శిక్షణ ముగింపు కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్లను అందించిన అనంతరం ఆయన ఆయన మాట్లాడారు. ముడి సరుకులు, వంటగది నిర్వహణ బాధ్యత మహిళలదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది మహిళలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 7 బ్యాచ్‌లలో కలిపి 190 మందికి శిక్షణ అందించామన్నారు. మరో మూడు బ్యాచ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాలన్నీ పర్యాటక శాఖ, నిథమ్ డైరెక్టర్ జెడ్ హనుమంతు పర్యవేక్షణలో సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం హమీద్, నిథమ్ శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి మిషెల్లీ జే ఫ్రాన్సిస్, నిథమ్, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వాకింగ్ ట్రాక్, సుందరీకరణ, చెరువులోకి ప్రగతి నగర్ డ్రైనేజీ నీరుతో పేరుకుపోతున్న వ్యర్థాల తొలగింపు పనులను వాకర్స్‌తో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రెండు రోజులకు ఒక్కసారైనా ఫాగింగ్ జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అదే విధంగా పలు కాలనీల ప్రజల నుంచి వినతుల మేరకు సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీ నారాయణ, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



అంబీర్ చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

నేర్చుకున్నారు.. నోరూరించేలా తయారు చేశారు





తెలంగాణ స్నాక్స్, వివిధ రకాల బిర్యానీలు, విభిన్న రకాల టీ, టిఫిన్స్, స్వీట్ల తయారీపై మహిళలకు నిథమ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లో గత సోమవారం ప్రారంభమైన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ 7వ బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. 10 రోజులపాటు శిక్షణ పొందిన 29 మంది మహిళలు నోరూరించేలా వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. - రాయదుర్గం

బహుభాషలు నేర్చుకోవడం అవసరం



మాట్లాడుతున్న వీసీ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: బహుభాషలు నేర్చుకోవడం అవసరమని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో ఆంగ్లభాష చరిత్ర.. పరస్పర చర్యలు' అనే అంశంపై మూడవ హిస్టరీ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ (హెచ్‌ఈఎల్‌ఈ) మూడవ సదస్సును బుధవారం ప్రారంభించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రపంచ దృక్పథాన్ని అవలంబించడం చాలా అవసరమన్నారు. ఇంగ్లిష్ ప్రొఫెసర్ వివిఎన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సమకాలీన బోధనా శాస్త్రంలోని సవాళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం 24 మంది పరిశోధక విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పత్రసమర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సల్మాహ్మద్ ఫారూఖీ, ఇంతియాజ్ హస్నైన్, రాహత్ ఫిరోజ్, సమీనా తబస్సుమ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరిచి, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండలాల ఎంఈవోలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని, అందుకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో కుత్బుల్లాపూర్ ఎంఈవో జమిని కుమారి, బాచుపల్లి ఎంఈవో రామకృష్ణ, దుండిగల్ ఎంఈవో కృష్ణ, అసిస్టెంట్ ఎంఈవో రమేష్ పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

జాతర పోస్టర్ ఆవిష్కరణ

సూరారం కట్ట మైసమ్మ ఆలయ జాతర పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరిగే జాతర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశమై సూచనలు చేశారు. భక్తులకు తాగునీరు, ఎలక్ట్రిసిటీ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ, ఆర్టీసీ సదుపాయం కల్పించాలన్నారు. జాతరలో పోకిరీల బెడద లేకుండా షీ టీమ్స్‌ను నియమించాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ సత్యనారాయణ, ఉప కమిషనర్ మల్లారెడ్డి, సీఐ భరత్ కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ జీఎం అశోక్, ఈఈ కిష్టప్ప, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మన్నె బాలేష్, సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు వీరారెడ్డి, ప్రసాద్, మల్లేష్, దారం సాయి, కృష్ణారెడ్డి, సురేష్, ఇంద్రసేన, సాయిగౌడ్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కట్టమైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ కమిటీ సభ్యులు